ప్రజాశక్తి
శుక్రవారం 4 జులై 2025

వ్యవసాయ శాఖ ఎడిగా సత్యవతి

ప్రజాశక్తి - సాలూరు

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులుగా జి.సత్యవతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస నుంచి ఆమె బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎడి మధుసూదనరావు బదిలీపై వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఎడి సత్యవతి మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి

విశాఖ రేంజ్ డీఐజి గోపీనాథ్ జెట్టి

ప్రజాశక్తి - పాచిపెంట

విద్యార్థినిలు కష్టపడి ఒక లక్ష్యంతో చదివినప్పుడే ఉన్నత స్థానాలకు వెళ్తారని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి అన్నారు. మండలంలోని పి.కోనవలస గిరిజన బాలికల జూనియర్ కళాశాలలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శక్తియాప్ మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డిఐజీ మాట్లాడుతూ తాను కూడా సోషల్ వెల్ఫేర్ స్కూల్లో చదువుకున్నానని, తన తల్లిదండ్రులకు చదువు రాదని, అప్పట్లో ఇంత మంచి వాతావరణం, సౌకర్యాల్లేవని, అయినప్పటికీ సంకల్పబలంతో చదువుకొని ఐపిఎస్ సాధించానని అన్నారు. అలాగే తనతో చదువుకున్న వారు దేశ విదేశాల్లో మంచి స్థాయిలో స్థిరపడి దేశానికి, సమాజానికి ఉపయోగపడుతున్నారని అన్నారు. కావున మీరు కూడా కష్టపడి మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు వెళ్లి మీ కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తేవాలని సూచించారు. మీ చదువుకు, భద్రతకు ప్రభుత్వం అనేక విధాలుగా సేవలు అందిస్తుందని అన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖ పిల్లలకు, మహిళలకు గట్టి భద్రతను ఇస్తుందని ఇందులో భాగంగా శక్తి యాప్ ప్రవేశ పెట్టిందని తెలిపారు. ఎటువంటి సమస్య వచ్చినా ఈ యాప్ ద్వారా పోలీస్ శాఖకు తెలియజేస్తే వెంటనే మీకు భద్రత కల్పిస్తుందన్నారు. చదువుతో పాటు మీ భద్రత పైన దృష్టి పెట్టాలని, సెల్ ఫోన్లు ఎక్కువగా ఉపయోగించి సమయాన్ని వృథా చేయొద్దని అన్నారు. అలాగే మాదకద్రవ్యాలు బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. టీనేజ్లో మోసపూరిత మాటలను నమ్మి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. మీకు ఎవరైనా ఎటువంటి ఇబ్బంది కల్పించినా వెంటనే పోలీసులకు, మీ కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు.

ఎస్‌పి మాధవరెడ్డి, ఎఎస్‌పి అంకిత సురాన మాట్లాడుతూ మీకు ఎటువంటి సమస్య వచ్చినా మీ వెంట మేము ఉన్నామని అన్నారు. అనంతరం ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థినీలకు డిఐజి సత్కరించారు. అంతకుముందు పి.కోనవలస చెక్ పోస్ట్‌ను పరిశీలించి అక్రమ గంజాయి రవాణాను నియంత్రించాలని అక్కడున్న సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సాలూరు రూరల్, టౌన్ సిఐలు రామకృష్ణ, అప్పలనాయుడు, స్థానిక ఎస్సై వెంకట సురేష్, పాఠశాల ప్రిన్సిపల్ ఎ.భవాని, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

పార్వతీపురంలో పెట్రోలు బంకును ప్రారంభిస్తున్న డిఐజి

పాచిపెంటలో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డిఐజి గోపీనాథ్ జెట్టి

పోలీసు వెల్ఫేర్ పెట్రోల్ స్టేషన్ ప్రారంభించిన డిఐజి

పార్వతీపురం: ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, విజిబుల్ పోలీసింగ్ లక్ష్యంగా జిల్లాకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 41 ద్విచక్ర వాహనాలు కేటాయించినట్లు విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి చెప్పారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పట్టణంలో మెయిన్ రోడ్డులో నిర్మించిన పోలీసు వెల్ఫేర్ పెట్రోల్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డితో కలిసి ప్రారంభించారు. అంతకుముందు కొత్తగా మంజూరైన 41 ద్విచక్ర వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 41 ద్విచక్ర వాహనాలను జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వీటిని ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు వినియోగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్పీ అంకిత సురాన, డిఎస్పీ రాంబాబు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రైవేట్ షాపులకే పరుగులు

రైతులకు అవసరమైన విత్తనాలు లేవట!

ప్రజాశక్తి - పాలకొండ

తాళాలు వేసి ఉన్న వ్యవసాయశాఖ కార్యాలయం

ఆరు గాలం పంటలు పండించిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. ప్రతి ఏటా ఖరీఫ్ వస్తే రైతులకు పాట్లు తప్పవు. వ్యవసాయానికి పెట్టుబడి, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడంతో పాటు సాగునీటి కోసం రైతులు కష్టాలు పడుతున్నారు. ఈ ఏడాదీ కూడా విత్తనాల సమస్య రైతులకు ఇబ్బందికరంగానే మారింది. వ్యవసాయ శాఖ అధికారులు దీనిపై పట్టించుకునే పరిస్థితి లేదు. మండలంలో సుమారు 15వేల ఎకరాల్లో వరి సాగవుతుంది. అయితే ఈ ప్రాంతంలో 50శాతం పైబడిన రైతులు సంపత్, నూజివీడు సన్నాలు రకాలను పండిస్తారు. ఆ విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో రైతులు ప్రైవేట్ షాపులకు వెళ్లి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి పరిస్థితి వస్తుంది. ప్రభుత్వం కేవలం 1061, ఆర్జీయల్ రకాలు మాత్రమే ఇక్కడకు సరఫరా చేసింది. ఇక్కడ ఉన్న వ్యవసాయ శాఖ అధికారులు కూడా రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలని ఉన్నత అధికారులకు ప్రతిపాదన పంపించలేదు. దీంతో ప్రైవేటు షాపులకు రైతులు పరుగులు పెట్టాల్సి పరిస్థితి వచ్చింది. 30 కేజీల బస్తా సుమారు రూ.1500 వరకు ధరపలికింది. అయినప్పటికీ అప్పులు చేసి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

తలుపులు తెరచుకోని ఎఒ కార్యాలయం

ప్రస్తుత ఖరీఫ్‌కు రైతులకు అందుబాటులో ఉండి, అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయశాఖ కార్యాలయం తలుపులు తీయడం లేదు. గత నాలుగురోజులుగా మండల వ్యవసాయ శాఖ కార్యాలయం తలుపులు తెరిచిన దాఖలాలు కూడా కనిపించడం లేదు. విత్తనాలు, ఎరువుల కోసం రైతులు వ్యవసాయ కార్యాలయానికి వస్తే కనీస సమాధానం చెప్పడానికి ఒక్కరూ కనిపించడం లేదు. దీంతో రైతులు పెదవిరుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు అవసరమైన వరి విత్తనాలు అందజేయాలని, అలాగే వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మూల్యాంకన విధుల రెమ్యునరేషన్ చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - పార్వతీపురం

పదో తరగతి 2025 వార్షిక పరీక్షల ప్రశ్నాపత్రాల మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యునరేషన్ చెల్లించాలని యుటిఎఫ్ మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి కె భాస్కరరావు డిమాండ్ చేశారు. విధులు నిర్వహించి 2,3 నెలలు గడిచినా ఇంకా రెమ్యూనరేషన్ చెల్లించకపోవడం సరికాదని, వీటి కోసం ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని చెప్పారు. కావున తక్షణమే వారికి రెమ్యునరేషన్ చెల్లించాలని ఆయన కోరారు. ఇంకా ఆలస్యమైతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లాలో కొన్ని చోట్ల క్లస్టర్ పాఠశాలల కూర్పు, క్లస్టర్ ఖాళీలకు ఉపాధ్యాయుల కేటాయింపు అశాస్త్రీయంగా జరిగిందని, దీన్ని సరిచేయాలని యుటిఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేశారు. పార్వతీపురం పట్టణంలోని కెపిఎం ఉన్నత పాఠశాల క్లస్టర్‌కు పదిమంది మున్సిపల్ పాఠశాలల ఎస్‌జిటిలను కేటాయించారని తెలిపారు. పట్టణంలో 16 పుర ప్రాథమిక పాఠశాలలుంటే అందులో కేవలం 3 పాఠశాలలు మాత్రమే కెపిఎం క్లస్టర్‌కు కలిపారని, మిగతా 13 పుర ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కలిపారని చెప్పారు. కానీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఒక్క ఎస్‌జిటి ఉపాధ్యాయుడ్ని కేటాయించకపోవటం అన్యాయమని అన్నారు. కెపిఎం క్లస్టర్‌కు 16 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను కలిసిన అధికారులు ఆ యజమాన్యానికి చెందిన ఒక్క ఎస్‌జిటి ఉపాధ్యాయుడ్ని కానీ ఎంటిఎస్ ఉపాధ్యాయుడ్ని కానీ కేటాయించలేదని అన్నారు. ఇది సరైన చర్య కాదన్నారు. దీనివల్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు అవసరమున్న ఉపాధ్యాయులను కేటాయించలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. కనుక వెంటనే కెపిఎం క్లస్టర్‌కు ఎంటిఎస్ ఉపాధ్యాయులను కేటాయించి, దాని పరిధిలోని మండల పరిషత్ పాఠశాలలకు వారిని పంపించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులను పై రెండు క్లస్టర్లలో ఉన్న పుర ప్రాథమిక పాఠశాలలకు అవసరమైన చోటకు కేటాయించాలని భాస్కరరావు విద్యాశాఖ అధికారులను కోరారు.

వర్షాకాలంలో పాముల బెడద

రైతుల ప్రాణాలతో చెలగాటం

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో గిరిజనులు ఉన్నచోటే విష సర్పాలు సంచరిస్తున్నాయి. ఎందుకంటే వారి జీవన ఆధారం కొండపోడు వ్యవసాయంతో ఇమిడి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో పాముల కాటుకు గురికాకుండా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తారు. ఈ ఏడాది పాములు అధికంగా ఉంటాయని జాగ్రత్తలు తీసుకోవాలని ఇప్పటికే విశ్లేషకులు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. వర్షాకాలంలో పాములు మరింత ఎక్కువగా బయటకు వస్తాయి. ముఖ్యంగా రైతులు వర్షాకాలంలో పాముల మధ్య సాహసం చేస్తారు. ఎందుకంటే పొలం పనులు ఈ నాలుగు నెలలు నిమగ్నమై ఉంటారు. పాముల కదలికలు గమనించుకొని ముందుకు వెళ్లాలి. రాత్రి వేళల్లో పొలాలు గొట్లపైన, గడ్డి పైన ఉంటాయని, శబ్దం చేసుకొని టార్చిలైట్ వేసుకుంటూ ముందుకు సాగాలని సూచనలు ఇస్తున్నారు. ఎక్కువగా కర్ర పట్టుకొని శబ్దం చేసుకుంటూ నడవాలని మోకాళువరకు బూట్లు వేసుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే ఏజెన్సీలో ఇటీవల కాలంలో పాముకాటుకు గురై ఇద్దరు మృతి చెందారు.

పాము కాటుకు ప్రథమ చికిత్స

పాము కాటు వేసిన వెంటనే ఆ భాగాన్ని శుభ్రం చేయాలి. మంచినీటితో కడగాలి. తాడుతో ఒక బొటన వేను ఖాళీగా ఉన్న అంతవరకు లూజుగా కట్టాలి. కాటు గురైన వ్యక్తి నడవకూడదు. రోగికి ధైర్యం చెప్పాలి. బ్రీతింగ్ అందక పోతే ఒక పక్కనే సైడ్ పడుకోవాలి. సమీపంలో ఉన్న ఆసుపత్రికి వెంటనే తీసుకొని వెళ్ళాలి. ఏజెన్సీలో ఐదు శాతం విష సర్పాలు ప్రమాదకరంగా ఉంటాయి. వీటితో రక్తపొడి, కట్ల పాము, నాగుపాము తదితరు పాములతో ప్రమాదం ఉంది. మిగతా వాటితో అంత ప్రమాదం ఉండదు.

నాటు వైద్యం చేయరాదు

పాము కాటుకు గురైన వ్యక్తులకు మంచినీళ్లతో కడిగేసి సమీపంలో ఉన్న ఆసుపత్రికి తీసుకొని వెళ్లాలి. పసర మందులు, నాటు వైద్యం చేయరాదు. కరిచిన చోట నోటితో విషం పీల్చకూడదు. సకాలంలో ఆసుపత్రికి తీసుకొని వస్తే వైద్య సేవలు అందుతాయి.

బి శ్రీనివాసరావు,సూపరింటెండెంట్, సీతంపేట ఏరియా ఆసుపత్రి.

సీతంపేట ఏరియా ఆసుపత్రిలో ఈఏడాది నమోదైన పాము కాటు కేసులు

నెల	కేసుల సంఖ్య
జనవరి.	1
ఫిబ్రవరి.	2
మార్చి	6
ఏప్రిల్	6
మే	3
జూన్	9
జులై	2
(ఇప్పటి వరకు) మొత్తం	29

కేసులు. వీటిలో ఐదు కేసులను శ్రీకాకుళం రిఫర్ చేశారు

పాము కాటుకు యువకుడు మృతి

సీతంపేట : మండలంలోని పత్తిక గూడ చెందిన నిమ్మక కిరణ్ (21) పాము కాటుకు గురై మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పత్తికగూడ చెందిన నిమ్మక కిరణ్ గత నెల 28 శనివారం రాత్రి మంచంపైన నిద్రిస్తుండగా రాత్రి సమయంలో పాము కాటు వేసింది. కుటుంబీకులు వెంటనే సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఎస్సై వై అమ్మనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కిరణ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పాము కాటుకు గురై మృతి చెందిన కిరణ్

డిపో వద్ద నిరస తెలుపుతున్న ఆర్‌టిసి డ్రైవర్లు

చర్చలు జరపకపోతే సమ్మె

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

ఆర్‌టిసి అద్దె బస్సుల యజమానులు చర్చలు జరపకపోతే సమ్మె చేస్తూ ఆందోళన ఉధృతం చేస్తామని అద్దె బస్సు డ్రైవర్లు హెచ్చరించారు. గురువారం డిపోలో హెయిర్ బస్ డ్రైవర్లు సిఐటియు ఆధ్వర్యంలో మూడవ రోజు నిరసన బ్యాడ్జీలతో డ్యూటీలో చేరే ముందు డిపో గేటు వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ, అద్దె బస్సు డ్రైవర్లు న్యాయమైన డిమాండ్లు పరిష్కారానికి ఆర్‌టిసి అధికారులు, బస్సు యజమానులు వెంటనే చర్చలు జరపాలని లేనిచో పదో తేదీ నుండి నిరవధిక సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు. ప్రత్యేకంగా సురేంద్ర రెడ్డి యజమాని కవ్వింపు చర్యలకు పాల్పడం, భయభ్రాంతులకు గురి చేయడం మానుకోవాలని నాయకులు కార్మికులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌ఆర్‌టిసి హైయర్ బస్సు డ్రైవర్లు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రెసిడెంట్ కె.వి చారి, సెక్రటరీ పీడీ ప్రసాద్, ఎ.అశోక్, ప్రెసిడెంట్ ప్రసాదు, అఖిల్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, జిల్లా కోశాధికారి గొర్ల వెంకటరమణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బంకురు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దశమంతపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, రక్తపోటు, గర్భిణులు, మధుమేహ తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆనంద్, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు ,104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

రైలులో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

రాయగడ-గుంటూరు రైల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

గంజాయి, మాదక ద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుం టామని ఎఎస్‌పి అంకిత సురాన అన్నారు. ఈ మేరకు గురువారం రాయగడ -గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి గంజాయి అక్రమ రవాణా అరికట్టే ఉద్దేశంతో తనిఖీ చేపడుతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 రైళ్లలో ఈ తనిఖీలు కొనసాగుతు న్నాయన్నారు. అందులో భాగంగా మన జిల్లాలోని ఈ రైలులో ఆకస్మిక తనిఖీలు చేపట్టా మన్నారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూ లనకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ 1972ను ఏర్పాటు చేశారని, ఈ నెంబర్‌కు సమాచారం అందిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో సిసిఎస్ సిఐ అప్పారావు, పార్వతీపురం రూరల్ సిఐ గోవిందరావు, కొమరాడ ఎస్సై నీలకంఠం, సిబ్బంది, డాగ్స్ స్క్వాడ్, బిడి టీం రైల్వే ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి పోలీసులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని సత్తా చాటిన విద్యార్థులను ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో బంగారు పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్ తరుపున ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జూన్ 23 నుంచి 25 వరకు జరిగిన జాతీయ స్థాయి తైక్వోండో పోటీల్లో అండర్ -25 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన షణ్ముఖ్ సిద్ధార్థ నాయుడు, అండర్ 48 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన బుగత హర్షవర్ధన్, మహిళల విభాగంలో అండర్ 32 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన ఇజ్జాడ వైష్ణవి దేవిని ఎమ్మెల్యే శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లాకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన విద్యార్థులు, జిల్లాలోని మిగిలిన యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు అవసరమైన సాయమందిస్తానని హామీ ఇస్తూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.

చేయాల్సిన పనులు చేస్తాం.. ఎప్పుడని అడక్కండి..

- రూ.20కోట్లతో రోడ్ల పనులు
- డోలీమోతలు పెద్దగా లేవు
- ఇంటింటికీ టిడిపి పర్యటనలో మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, చేయాల్సిన పనులన్నీ చేస్తామని, ఎప్పుడు చేస్తారని అడగొద్దని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ మరియు గిరిజన శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని పనసభద్ర పంచాయతీ దుగ్గేరు, మార్కొండపుట్టి గ్రామాల్లో గురువారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టిడిపి అనే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఇటీవల కాలంలో జరిగిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు ఎలా అందాయన్న అంశాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుండి మంచి అభిప్రాయం వ్యక్తం అవుతుందన్నారు. మండలంలో గ్రామాల మధ్య రహదారులకు రూ.20 కోట్లు మంజూరు చేశామన్నారు. అందరూ కోరుకొనేలా దుగ్గేరులోనే పిహెచ్‌సి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అయితే ఇది ఎప్పుడవుతుంది అని మాత్రం ప్రశ్నించొద్దని, చేయాల్సిన పనులు అన్నీ పూర్తి చేస్తామని అన్నారు. మక్కువ ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు టెండర్ దశలో ఉందని టెండర్ పూర్తి అయిన వెంటనే వెడల్పాటి రోడ్డుతో పాటు ఇరువైపులా కాలువలను మజ్జి గౌరమ్మ గుడి నుంచి సువర్ణముఖి నది వరకు నిర్మించనున్నట్టు తెలిపారు. మక్కువలో 18 రోడ్లు మంజూరైనప్పటికీ సర్పంచ్ సహకరించక అభివృద్ధి పనులు నిలిచిపోయాయని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ అందర్నీ గెలిపించేందుకు సహాయ సహకారాలు అందిస్తానని, ఇందు కోసం అంతా కలిసికట్టుగా ఉండాలని సూచించారు.

డోలిమోతలపై గిట్టని రాతలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన ప్రాంత రహదారులు అభివృద్ధిపై దృష్టి సారించామని రెండో, మూడో తప్ప డోలీమోతలు పెద్దగా లేవని తనపై గిట్టని వారు డోలిమోతలు ఎక్కువ అంటూ రాతలు రాస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ ఆరోగ్య సలహాలు ఇచ్చే ఆశా కార్యకర్త ముందుగా ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పురుడుపోసుకోవాలని తెలియదా? అని ప్రశ్నించారు. గిరిజన గ్రామాల రహదారుల అభివృద్ధికి మిగిలిన సంక్షేమ పథకాల అమలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఆ మాటల్లో తప్పులేదు... కేసులు ఎన్ని అయినా పెట్టుకోండి

ఇటీవల సాలూరు పట్టణంలో తాను చేసిన 'తదగాకోరు మాటలను' ఇప్పటికే అలాగే అంటానని తనపై ఎన్ని కేసులు అయినా పెట్టుకోమని, దీనికి క్షమాపణలు చెప్పే పరిస్థితి లేదని మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాల నాయుడు అన్నారు. ఈ మాటలను మంత్రి సంధ్యారాణి కూడా తన ప్రసంగంలో కల్పించుకొని వాటిని సమర్ధించారు వైసిపి నేతలను, అప్పటి ప్రభుత్వాన్ని దగాకోరులు అంటే తప్పేముందని ఆమె సమర్ధించారు. వారి ప్రభుత్వంలో ఎన్నో కార్యక్రమాలు ప్రజలను తప్పుతోవ పట్టించేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్‌చైర్మన్ ఎం.సింహాచలం, డాక్టర్ మల్లేశ్వరరావు, వీర భోగ వసంత రాయలు, పోతుల దుర్గారావు, వెంపటాపు స్వామినాయుడు, సిహెచ్ బుచ్చినాయుడు, బొంగు వాసుదేవరావు మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరు వానలో ఎమ్మెల్యే ప్రచారం ...

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కేదారిపురంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జోరు వానలో కొనసాగింది. కార్యక్రమం ప్రారంభంలో జోరు వాన కురవడంతో గొడుగుల సాయంతో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించడం కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఆమె అన్నారు. అనంతరం సూపర్‌సిక్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బిడ్డిక పద్మావతి, ఎఎంసి చైర్పర్సన్ కద్రక కళావతి, ట్రైకార్ బోర్డు డైరెక్టర్ పువ్వల లావణ్య, మండల టిడిపి కన్వీనర్ అడ్డాకుల నరేష్, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణరావు, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, నాయకులు వెంకట్రావు, బుజ్జేశ్వరరావు, మురళి, ప్రసన్న, నాగమణి, జానకి, దామోదరరావు, అప్పలస్వామి, చలపతి, రామకష్ణ, రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కేదారిపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సీతానగరం : మండలంలోని బూర్జలో సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి టిడిపి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, అన్ని శాఖల అధికారులు నిర్వహించారు. గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామసభ నిర్వహించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి కష్టాలు, రోడ్లు, కాలువలు లేకపోవడం, విద్యుత్ సరఫరాలో ఆటంకాలు, అనారోగ్య సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర సంబంధిత అధికారులతో చర్చించి ఆయా సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామంలో చాలామంది జ్వరంతో బాధ పడుతుండటాన్ని గుర్తించిన ఎమ్మెల్యే తక్షణం ఆరోగ్యం శిబిరం ఏర్పాటుచేసి వైద్య సేవలు అందించాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, అబ్జర్వర్ అప్పలనాయుడు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

శ్రీ సత్యసాయి సేవా సమితి జియమ్మ వలస ట్రస్ట్ సభ్యులు మండలంలోని దాదుపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్‌బుక్కులు, స్లేట్లు, పెన్, పెన్సిళ్లను పంపిణీ చేశారు.సుమారు రూ.3వేలు విలువైన పుస్తకాలను విరాళంగా ఇచ్చారు. ట్రస్ట్ సభ్యులకు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

పాడి రైతులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పాడి రైతులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం రాయితీపై పశు దాణా అందిస్తుందని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తడ గోపీశంకర్ తెలిపారు. స్థానిక సచివాలయ పరిధిలో గల రైతు సేవా కేంద్రం వద్ద పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశు దాణా బస్తాలను రైతులకు అందించారు. దాణాతో పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. గుమ్మలక్ష్మీపురం, గొరడ పశు వైద్యాధికారి పి.లక్ష్మణ రావు మాట్లాడుతూ మండలానికి 50 శాతం రాయితీపై 4వేల కిలోల దాణా సిద్ధంగా ఉందని, రైతులు ఈ దాణాను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగు మాత్రలతో ఆరోగ్యానికి మేలు

ప్రజాశక్తి - వీరఘట్టం

నులిపురుగు మాత్రల వల్ల ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని, వైద్యాధికారులు ఏ మానస, బి. ప్రదీప్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని బీటీవాడ, వీరఘట్టం ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల పాఠశాలల విద్యార్థులకు నులిపురుగు మాత్రలు పంపిణీ చేశారు. ఆరు నెలలకు ఒకసారి మాత్రలు వేయటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, విద్యార్థులకు సూచించారు. ఈ మాత్రలు వేయటం వల్ల కడుపు నొప్పి ఉండదని, రక్తహీనత కూడా గురికారని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాటు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో జరుగుతున్న జగన్నాథ రథయాత్రను పురస్కరించుకొని శ్రీవిజయ హాస్పిటల్ చేపడుతున్న ఉచిత వైద్య శిబిరం నిర్వహణ స్థలాన్ని నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు గురువారం పరిశీలించారు. ఆస్పత్రి మేనేజర్ ధర్మతో పలు విషయాలు చర్చించారు. యాత్రకు వచ్చిన వారంతా వైద్య శిబిరం వినియోగించుకోవాలని కోరారు. ఆయనతో పాటు పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, కౌన్సిలర్ పడాల రాంబాబు తదితరులు ఉన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బంది దౌర్జన్యం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో గల ఎస్‌కె రాజపురం ఎస్సీ వీధిలో గురువారం విద్యుత్ శాఖ సిబ్బంది దౌర్జన్యానికి పాల్పడ్డారు. గత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్తు అందించడంతో ఎవరూ బిల్లులు కట్టలేదు. అయితే ప్రస్తుతం వేలాది రూపాయలు బిల్లులు పెండింగ్ ఉన్నట్టు చూపిస్తూ విద్యుత్ లైన్ కట్ చేయడానికి సిబ్బంది పూనుకున్నారు. దీంతో మహిళలు అడ్డుకున్నారు. తమకు కొంత సమయం ఇవ్వాలని కోరినప్పటికీ సిబ్బంది నిరాకరించడంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- సీతంపేట

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ బిబి మిస్రో అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సీతంపేట, బామిని, వీరఘట్టం, పాలకొండ పరిధిలో గల పది పిహెచ్‌సిల సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, హెల్త్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా తగు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీకాకుళం జిల్లా సహాయ మలేరియా అధికారి ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫర్ అయి కొత్తగా వచ్చిన హెల్త్ అసిస్టెంట్లు వ్యాధులు ప్రబలకుండా సర్వేలెన్స్ ట్రీట్మెంట్ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సూపర్‌వైజర్లు మానిటరింగ్ చేస్తూ క్షేత్ర స్థాయిలో నివారణ చర్యలు జరగాలన్నారు. సెకండ్ రౌండ్ ఐఆర్ఎస్ కూడా నూరు శాతం అమలైనట్లు చెప్పారు. ఈ సమావేశంలో సీతంపేట సబ్ యూనిట్ అధికారులు జె.మోహన్‌రావు, పాలకుండ సబ్ యూనిట్ అధికారి ఎం.మోహన్ రావు, సీతంపేట, బామిని ఎంటిఎస్ జాన్సీ, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

అంగన్వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల పైబడి ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు శ్రద్ధ వహించాలని ఎంఇఒ - 2 ఆర్.ఆనందరావు అంగన్వాడీ కార్యకర్తలను ఆదేశించారు. గురువారం స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రికార్డుల్లో ఐదేళ్ల దాటిన పిల్లల వివరాలను పరిశీలించి అందుబాటులో ఉన్న పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే పాఠశాలల్లో జాయిన్ అయ్యారా? లేదా ఎందుకు జాయిన్ అవ్వలేదు ఎక్కడ ఉన్నారు. వివరాలు పొందుపర్చి తమకు అందజేయాలన్నారు. తప్పు తడకలు లేకుండా స్పష్టంగా రికార్డులను పరిశీలించి వివరాలను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జ్ఞానమ్మ, రాజేశ్వరి, సీఆర్పీలు జగదీష్, వెంకటలక్ష్మి, సంగయ్య, దుర్గారావు, సింహాచలంతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తిపలికి జ్యూట్, గుడ్డ బ్యాగులను వాడాలని తహశీల్దార్ కె.జయ అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగులరహిత దినోత్సవం సందర్భంగా గురువారం ఎస్.సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఆధ్వర్యాన బియ్యాల వలస, గొటివాడ, రస్తా కుటుంబాయి తదితర గిరిజన ప్రజలకు ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పాటు కోసం అవగాహన కల్పిస్తూ స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద గిరిజనులకు అందజేసిన క్లాత్ బ్యాగుల పంపిణీలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడడం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, కావున ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పి గుడ్డ, జ్యూట్‌తో తయారు చేసిన బ్యాగ్‌లు వాడి పర్యావరణాన్ని పరిరక్షించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. డిటి కె.సురేష్ కుమార్, సివిల్ సప్లై డిటి ఎ.సాంబమూర్తి, బియ్యాలవలస సర్పంచ్ పి.అజ్జూరి, మాజీ సర్పంచ్ పువ్వల పత్తి తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం గడసింగిపురంలో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు కురుపాం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. అక్రమంగా నాటు సారా అమ్ముతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి నాటు సారా అమ్ముతున్న గడసంగిపురానికి చెందిన గరుగుబిల్లి దమయంతిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా నాటుసారా అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

సత్య ట్రస్టు ఆధ్వర్యంలో హడ్డుబంగి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, సీతంపేట బాలుర ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులు లేని 90 మంది గిరిజన విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్య ట్రస్ట్ అధ్యక్షులు ఎస్.పెంటయ్య, ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి, డిప్యూటీ వార్డెన్ నవీన్ రాజారావు, ప్రసాదరావు శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి

జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు సూచించారు. జియమ్మవలస మండలంలోని పెద్ద బుడ్డిడి పంచాయితీలో పారిశుధ్య పనులను ఆయన గురువారం పరిశీలించారు. పారిశుధ్య పరిస్థితిని చూసి ఒకంత ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో వారంలో ప్రతి ఐదు రోజులు తడిచెత్త సేకరణ, ప్రతి శనివారం పొడి చెత్త సేకరణ విధిగా జరపాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకులు శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామంలోని వాటర్ ట్యాంక్ గత 30 సంవత్సరాల క్రితం నిర్మించారని ఫలితంగా పెచ్చులూడి పడుతున్నాయని దీనికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. మండలంలో పెద్ద పంచాయతీ అయినప్పటికీ సచివాలయ నిర్మాణం మధ్యలో ఆగిపోయి ప్రస్తుతం అద్దె భవనంలో విధులు జరుపుతున్నారని, గ్రామానికి విద్యుత్ సంబంధించి లైన్ మాన్ కూడా లేకపోవడంతో విద్యుత్ అంతరాయం జరుగుతున్న సమయంలో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎంపిటిసి సీమల బాబు, భువన మోహనరావు డిఎఒ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో డిపిఒ విద్యుత్ శాఖ అధికారులతో సోలార్ ఎనర్జీ పై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కర్రీ ధర్మారావు, పెద్ద బుడ్డిడి పంచాయతీ కార్యదర్శి టి లక్ష్మణరావు, క్షేత్ర సహాయకులు వావిలపల్లి వరహాలనాయుడుసిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: ఇంటింట పారిశుధ్యం పరిశీలిస్తున్న ఎంపిడిఒ

పాచిపెంట: మండలంలోని విశ్వనాథపురంలో పారిశుధ్య పనులను ఎంపిడిఒ బెహరా పాత్రో గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన ఇంటింటికి చెత్త సేకరణ, గ్రీన్ అంబాజిడర్స్ ద్వారా సేకరించిన పనులను పర్యవేక్షించారు. గ్రామంలో ఉండే మంచినీటి ట్యాంకులు, పారిశుధ్య పనులు ఏ విధంగా ఉన్నాయోనని పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్‌తో కలిసి పరిశీలించి ట్యాంక్‌పైకి ఎక్కి దగ్గరుండి క్లోరినేషన్ చేయించారు. ఇదే గ్రామంలో 10 నెలల క్రితం డయేరియా ప్రబలడంతో ముందు జాగ్రత్తగా, వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రజలకు పరిశుద్ధమైన తాగునీరందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గొర్లె సత్యవతి, ఉపసర్పంచ్ అధికార్ల సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్ గొర్లె దేవేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : ప్రతి గ్రామపంచాయతీని స్వచ్ఛ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మండలంలోని కుమ్మరిగుంట గ్రామపంచాయతీలో శానిటేషన్, తాగునీరు, ఇంటింటికి చెత్త సేకరణ పనులను గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రత కోసం, పొడి చెత్త, తడి చెత్తతో కలపకుండా ఇంటి వద్ద గోనెసంచులు ఏర్పాటు చేసుకొని పొడి చెత్త వేరుగా ఇవ్వాలన్నారు. తాగునీరు కుళాయిలు, మురుగునీటి కాలవలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఈగలు, దోమలు, ఇతర వైరస్, కీటకాలు లేకుండా ప్రజలకి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. వీధుల్లో పారిశుధ్యం పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి రాధాకృష్ణ, సర్పంచ్ జి.లక్ష్మణరావు, ఎంఆర్‌సి క్రాంతి కుమార్, పంచాయతీ కార్యదర్శి, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని చెల్లంనాయుడువలస గ్రామపంచాయతీలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని గురువారం ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ ప్రతి ఇంటి దగ్గరికి వెళ్లే బుట్ట ద్వారా చెత్త సేకరణ చేసి తడి చెత్త పొడి చెత్తను వేరు చేయాలన్నారు. చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి దాని ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మంచినీటి ట్యాంకులను పరిశీలించి అక్కడ వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ కలిపి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె.కుమార్‌వర్మ పంచాయతీ కార్యదర్శి పీటర్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: సిబ్బందికి సూచనలు చేస్తున్న డిపిఒ కొండలరావు

గుమ్మలక్ష్మీపురం : గ్రామాల్లో ప్రజలు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపిడిఒ త్రివిక్రమరావు సూచించారు. మండలంలోని పి.ఆమిటి పంచాయతీలో ఆయన గురువారం పర్యటించారు. ప్రతిరోజు గ్రీన్ అంబాసిడర్‌లు ఇంటింటికి వస్తారని వారికి ఇంటి వద్దనున్న పొడి చెత్త, తడి చెత్త వేరుచేసి అందించాలని కోరారు. వీధి కాలువలు వద్ద చెత్త వేయరాదన్నారు. రక్షిత ట్యాంకులు వారానికి రెండుసార్లు పరిశుభ్రం చేసుకుని నీటితో నింపాలన్నారు. బోర్ల వద్ద క్లోరినేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జూలై 9 దేశ వ్యాప్త కార్మిక, కర్షక సమ్మె నేపథ్యంలో పట్టణంలోని జగన్నాథపురంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పార్వతీపురం పట్టణ ఆరోగ్య కేంద్ర అధికారులు విజయ మోహన్, గణేష్ నాయుడుకు గురువారం సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, శ్రామిక మహిళ నాయకులు బి.లక్ష్మి మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యరంగంలో పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు ఆశ వర్కర్స్‌పై పని భారం పెంచుతున్న ప్రభుత్వం వారికి జీత భత్యాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఇప్పటికైనా ఆశాలు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శ శివాని, నాయకులు పద్మ, భాగ్యం, దేవి, అరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: వైద్యునికి సమ్మె నోటీసు ఇస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి

ఆశా వర్కర్ల సమ్మె నోటీసు

మక్కువ: ఈ నెల 9న జరనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని మండలంలోని ఆశా వర్కర్ల నాయకులు అనిత అన్నారు. గురువారం స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హరికృష్ణకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయడం లేదని చట్టాలను మార్చేసి 4 లేబర్ కోడ్లుగా తీసుకొస్తున్నారని ఈ లేబర్ కోడ్ల వల్ల ఉద్యోగ భద్రతకు పెనుముప్పు ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపడుతున్న సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, విఆర్‌ఎ సంఘం అధ్యక్షులు పవన్ కుమార్, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఈ నెల 9న చేపట్టబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు మండంగి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం దుడ్డుఖల్లు పిహెచ్‌సి వైద్యురాలు స్వాతికి సమ్మె నోటీసును ఆయనతో పాటు ఆశా కార్యకర్తలు, సిహెచ్‌డబ్లుఒలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఆశా వర్కర్లు, సిహెచ్‌డబ్ల్యుఒలు విధులు నిర్వహిస్తున్నా సరైన గుర్తింపు లేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని తదితర సమస్యలపై సమ్మెలో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు పువ్వల తిరుపతిరావు ఉన్నారు.

జన్ జాతీయ గౌరవ్ వర్ష్ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

పార్వతీపురం : జన్ జాతీయ గౌరవ్ వర్ష్ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమం డిడి ఆర్.కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని జన్ జాతీయ గౌరవ్ వర్ష్‌లో భాగంగా వివిధ రంగాల్లో గణనీయమైన కృషి చేసిన 150 మంది గిరిజన సాధకులను సత్కరించాలని భారత గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంలో సంస్కృతి, క్రీడలు, విద్య, వ్యవస్థాపకత, ప్రజా సేవ లేదా ఇతర సంబంధిత రంగాల్లో కృషి చేసిన వారికి, ప్రతి రాష్ట్రం నుండి 10 మంది గిరిజన సాధకుల జాబితాను అందించాలని మంత్రిత్వ శాఖ అభ్యర్థించిందన్నారు. ఈ వ్యక్తులను గుర్తించేటప్పుడు, వారి పని ప్రభావం, ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. గిరిజనులలో అన్ని వర్గాల ప్రాతినిధ్యం ఉండాలని ఆమె పేర్కొన్నారు.

5న వైసిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి -కురుపాం :

ఈనెల 5న మన్యం జిల్లా వైసిపి విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షితరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ మంత్రులు, పార్లమెంట్ పరిశీలకులు, ఎంపీ, ఎమ్మెల్సీ,నియోజకవర్గ సమన్వయకర్తలు మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు హాజరవుతారని అన్నారు. కావున శనివారం పార్వతీపురం రాయల్ కన్వెన్షన్ హాల్లో జరుగు సమావేశానికి పార్టీ శ్రేణులు, మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం నుంచి మండల స్థాయి పార్టీ కమిటీల వరకు వివిధ హోదాల్లో గల సభ్యులు, ఎంపిపిలు, జడ్పీటీసీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ డిసిసిబి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సాలూరు : ఈనెల 5న పార్వతీపురంలో గల రాయల్ కన్వెన్షన్ హాలులో వైసిపి జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు. ఈ సమావేశానికి జిల్లాలోని వైసిపికి చెందిన అన్ని విభాగాల నాయకులు, ఎంపిపిలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్‌లు హాజరు కావాలని రాజన్నదొర ఒక ప్రకటనలో కోరారు.

గరుగుబిల్లి : వైసిపి జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఈనెల 5న పార్వతీపురంలో జరుగుతుందని, కావున ఈ సమావేశానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని మండల వైసిపి అధ్యక్షులు కేతిరెడ్డి అచ్యుతరావు తెలిపారు. మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి అంతా హాజరు కావాలని ఆయన కోరారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంలను నియమించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎఎన్‌ఎంలను నియమించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కూరంగి సీతారాం డిమాండ్ చేశారు. గురువారం జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న జియ్యమ్మవలస ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వద్దకు వెళ్లి పరామర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మొదటి సంతకం ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమిస్తామని పెట్టి సంవత్సరమైనా ఇంతవరకు అమలు కాలేదని అన్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఎక్కువ మంది విద్యార్థులు జ్వరాలు బారిన పడుతున్నారని, తక్షణమే ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించి విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపట్టాలని లేనిచో పెద్ద ఎత్తున గిరిజనలను కదిలించి ఆందోళన చేపడు తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరుగుబిల్లి శ్రీను పాల్గొన్నారు.

కొమరాడ : సంక్షేమ హాస్టల్లో ఎఎన్‌ఎంలను నియమించాలని, మౌళిక వసతులు కల్పించి అన్ని విధాలా విద్యార్థులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో గిరిజన సంక్షేమ హాస్టళ్లలో నేటికీ ఎఎన్ ఎంలను నియమించకపోవడం వల్ల అక్కడ వార్డెన్లు, హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే ఆశ్రమ పాఠశాలల్లో అనేకమంది విద్యార్థులు జ్వరాల బారిపడ్డారన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా అధికారంలోకి వచ్చి ఏడాదైనా సంక్షేమ హాస్టళ్లలో ఎఎన్‌ఎంలను నియమించకపోవడం అన్యాయమన్నారు. అలాగే కుక్‌లను కూడా నియమించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే సంక్షేమ వసతిగృహాల్లో ఎఎన్‌ఎంలను నియమించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులను పరామర్శిస్తున్న సీతారాం

కూర్మారావు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్‌కు చెందిన గజపతి కూర్మారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు అన్నివిధాలా అండగా ఉంటామని, ఏ సమయంలో ఎటువంటి అవసరమైనా తనను సంప్రదించాలని ధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, నాయకులు ఆరిక విప్లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరేష్ పరామర్శ

మండలంలో మొండెంఖల్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాలుబాబు, గజపతి, కూర్మారావు కుటుంబ సభ్యులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ గురువారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యాన్నిచ్చి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మండలంలో ఇటీవల మొండెంఖల్ గ్రామానికి చెందిన గజపతి కూర్మారావు, బాలుబాబు, బొడ్డమానుగూడ గ్రామంలో ఇటికి బట్టిలో దిగి మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు, పి. లేవిడిలో మృతి చెందిన మోహన్ దాస్ కుటుంబ సభ్యులకు, గోటివాడ, నీలకంఠాపురం, వెంపటాపురం గ్రామాల్లో మృతి చెందిన వైసిపి కార్యకర్తల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి గురువారం వారి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యంగా ఉండమని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, వైసిపి మైనార్టీ సంయుక్త రాష్ట్ర కార్యదర్శి షేక్ నూరుల్లా, కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వీరేష్

రాయితీపై విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో 100శాతం రాయితీతో కందులు, రాగులు విత్తనాలను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి రైతులకు గురువారం పంపిణీ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు కురుపాం ఎడిఎ రెడ్డి అన్నపూర్ణ, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల ఎఒలు పి.శంకరరావు, జ్యోత్స్న, భారతి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విత్తనాల పంపిణీ కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, కొమరాడ మండల తెలుగు రైతు అధ్యక్షులు బత్తిలి శ్రీను, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు,తదితరులు ఉన్నారు.

సీతంపేట : రాయితీపై ప్రభుత్వం అందించే విత్తనాలను గిరిజన రైతులు వినియోగించుకోవాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని కుసిమిలో గల రైతు సేవా కేంద్రంలో కందులు, రాగి విత్తనాలు సబ్సిడీలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 100శాతం సబ్సిడీపై కందులు, రాగి విత్తనాలు పంపిణీ చేసిందన్నారు. ఎకరా వరి పొలం గట్లపై అరకేజీ కందులు చొప్పున వేసుకోవాలన్నారు. ఏజెన్సీలో రాగి ప్రధాన పంటగా ఉందన్నారు. రాగులు రెండు కేజీలు, కందులు అరకేజీ చొప్పున పంపిణీ చేశామని వ్యవసాయ అధికారి వై.వాహిని తెలిపారు. కార్యక్రమంలో ఎడిఎ కె.రత్నకుమారి, ఎఎంసి చైర్మన్ సంధ్యారాణి, ఎంపిడిఒ మిస్రో, కూటమి నాయకులు హెచ్ ప్రసాదరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: విత్తనాలను అందిస్తున్న ఎమ్మెల్యే

పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. గురువారం పట్టణంలోని నాలుగో వార్డులో గల ఎస్ఎన్ఎం కాలనీ, 29వ వార్డులో గల కుసుంగుడ్డి వీధిలో రూ.25 లక్షలతో చేపట్టనున్న రోడ్లు, కాలువలు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడం, రోడ్లు, కాలువలు, తాగునీరు విద్యుత్తు వంటి మౌలిక వసతులు సమకూర్చడం, ప్రజల అవసరాలను గుర్తించి నిధులు మంజూరు చేయడానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు వెల్లడించారు. రోడ్లు, కాలువలు నిర్మాణంలో నాణ్యత పాటించి త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అప్పగించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను, అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజల అభ్యర్థన మేరకు కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేతకాక మాపై విమర్శలా?

ప్రజాశక్తి- సాలూరు

ఏడాది కాలంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం చేతకాక గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులను విమర్శించడం తగదని వైసిపి మండల అధ్యక్షులు పువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు జర్జాపు మోహన్, బంకురు తిరుపతినాయుడు అన్నారు. బుధవారం ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో భాగంగా మంత్రి సంధ్యారాణి శివరాంపురంలో చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ వారు మాట్లాడారు. పంచాయితీలలో అభివృద్ధి పనులను తాము అడ్డుకోలేదని, జాతీయ ఉపాధి హామీ చట్టం ప్రకారం పనులు చేయాలని కోరుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన అభివృద్ధి పనులే ఇప్పుడు నియోజకవర్గంలో చేస్తున్నారని, టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులేమిటో చూపించాలని డిమాండ్ చేశారు. ఏడాది పాలనలో మంత్రి సంధ్యారాణి ఏయే పనులు చేశారో ప్రజలకు బాగా తెలుసు అన్నారు. శివరాంపురం వంతెన నిర్మాణం పూర్తి చేయకపోవడంతో మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరని ఓడించారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టిడిపి ప్రభుత్వం హయాంలో నైనా వంతెన నిర్మాణం పూర్తి చేయాలని, ఒకవేళ చేయకపోతే ప్రజలు టిడిపికి కూడా అదే బుద్ధి చెబుతారని చెప్పారు.

విద్యార్థుల నమోదు పెంచాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని ఎంఇఒ-1 ఎస్. సింహాచలం అన్నారు. మండలంలోని గిజబ, నాగూరు మోడల్ ప్రైమరీ స్కూళ్లను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా గిజబ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల స్థాయిని పరిశీలించారు. 4.5 తరగతుల విద్యార్థులతో ఆంగ్లం, తెలుగు పాఠ్యాంశాలను చదివించారు. విద్యార్థుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ తప్పనిసరిగా పెంచాలని ఆదేశించారు. అనంతరం నాగూరు మోడల్ ప్రైమరీ స్కూల్ ను సందర్శించి విద్యార్థుల పఠన, లేఖన నైపుణ్యాలను పరిశీలించారు. నోట్ పుస్తకాలను పరిశీలించి చక్కటి దస్తూరితో రాసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఎం.సింహాచలం, మాజీ సర్పంచ్ కృష్ణ , క్లస్టర్ హెచ్‌ఎం రాజేశ్వరరావు, సిఆర్పి శంకర్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.